# మూగజీవులు

## -ఇల్లిందల సరస్వతీదేవి (1918-1998)

జన్మస్థలం పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం. తెలంగాణాలో మధ్య తరగతి మహిళల ప్రగతి కోసం 1934లో "ఆంధ్ర యువతీ మండలి" స్థాపించారు. ఈమె మొదటి కథ 1933లో గోలకొండ పత్రికలో ప్రచురితమైంది. స్వర్ణకమలాలు, తులసీదళాలు సరస్వతీదేవి కథా సంపుటాలు. జీవన సామరస్యము, నారీ జగత్తు, వెలుగుబాటలు, ముత్యాల మనసు, బాలవీరులు మొదలైనవి వీరి యితర సంపుటాలు. 1958-66లో ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యురాలుగా సేవలు అందించారు. కేంద్ర సాహిత్య అకాడెమీ బహుమతిని అందుకున్న విదుషీమణి. ఈ కథ రచనా కాలం 1969.

---

ఆ విశాలమయిన స్థలంలో ప్రహరీగోడ నాలు గడుగుల ఎత్తు - కత్తిరించిన సరుకుచెట్లు ఆర డుగుల ఎత్తు తెలుపూ పచ్చటి గోడల మాదిరిగా నాలుగువైపులా అందంగా కనబడుతున్నాయి. ఆ చిన్న బంగళా ఆధునిక సౌకర్యాలతో సరికొత్త నమూనాలో, ఆవరణలో మధ్యగా ఒక అందమైన బొమ్మను నిలబెట్టినట్టుగా ఉంది. బంగళాకు ఎదురుగా నాలుగు చదరపు గజాల హవుజ్ నీళ్ళతో నిండి ఉంది. దానిలో బంగారు రంగు చేపలు మునుగుతూ తేలుతూ ఈత కొడుతుంటే తోకలు ఝాడిస్తుంటే చూడముచ్చటగా ఉంటుంది. హవుజ్ చుట్టూ పచ్చిక-దానిచుట్టూ పూలతోట కన్నుల పండువుగా ఉంటుంది. వీధి వాకిలి ప్రహరీ గోడ వైపు నానుకుని ఒక మోటారు గారాజి-దాని పక్కగా నౌకరుకొక గది-ఆ గది ముందర గోల్డ్ మొహర్ చెట్టు-తెల్లారేసరికి ఇంతెత్తు పూలరాసిని రాలుస్తూ ఉంటుంది.

ఇది నసీరుద్దీన్ జాగీర్దారుగారి విలాస భవనము.

"రంగన్నా, ఈ తోట, ఈ బంగళా బాగా చూశావా? ఈ బంగళాను దులిపి తుడిచి ఎప్పుడూ శుభ్రంగా ఉంచాలి. ఈ తోట ఎప్పుడూ పచ్చపచ్చగా ఉంచాలి. ఏ చెట్టు వాడినా-ఎండినా దొర ఊరుకోడు. ఆ మూలనున్న ఎరువులు వేసి నీరు బాగా పట్టు. ఎండల్లోనయినా తోట ఇట్లానే ఉండాలె. బంగళా మీద దుమ్ము పడనీయకు. రెండు పూటలా ఊడ్చి కుర్చీలూ సోఫాలూ దులుపు కునీ పని కాగానే ఇంత వండుకుతిను. ఈ గేటు దగ్గర గోనెపట్టా యేసుకుని కూకో. నేను సరింగ మూడు నెలలకు తిరిగొస్త." శాయన్న రంగన్నను కూర్చోబెట్టుకుని బంగళావైపు చూస్తూ చెబు తున్నాడు.

"అదేం? నీవెటు బోతవు?" ఆశ్చర్యపడ్డాడు

ఆణిముత్యాలు

రంగన్న.

"నీకు తెలియందేముందిర రంగన్న? మా లింగమ్మకు లగ్గంచేసి అత్తగారింటి కంపిస్త. ఏదయిన కొరవడితే తల్లిలేని బిడ్డ ఏడిచిపోతది." శాయన్న తలపాగా విప్పి మళ్ళీ చుట్టుకున్నాడు.

"ఈ దొర ఎన్నడు ఈడికొచ్చేది?" రంగన్న ఆ తోటను మరొకసారి పరికించి చూశాడు. కొత్తగా రంగులు వేసిన బంగళా ముచ్చటగా ఉంది చూడటానికతడికి. కళ్ళు పెద్దవి చేసుకుని మరీ మరీ చూస్తున్నాడు రంగన్న.

"దొర వస్తడు గాని, ఎన్నడు వస్తడో చెప్ప లేము. ఇప్పుడో అప్పుడో వస్తడన్నట్టు ఉండాలె

నీవు" అన్నాడు శాయన్న.

"చూడు రంగన్న, ఊరి బయట ఉన్న బంగళా అని భయపడేవు. అరమైలు దూరం దాటితే చిన్న, పెద్ద ఇళ్ళు చాలా ఉన్నాయి. జనం తిరుగుతూ ఉంటారు" అన్నాడు మరచిపోయిన మాటను జ్ఞాపకం తెచ్చుకొని చెప్పినట్టుగా.

రంగన్న ఆలోచనా రహితంగా నిలబడి పోయాడు. తను కమతం చేసే చోట పని ఎక్కువ-ఆదాయం తక్కువ. గొడ్డుచాకిరి చేసినా ఒక గుప్పెడు గింజలు ఎక్కువ ఇచ్చేవారు కాదు. చేసిన పనికి మెచ్చేవాళ్ళూ కారు. కాని- తల్లీ తండ్రీ ఆ భూకామందు ఇచ్చిందే తింటూ ఆ గొడ్డు చాకిరీ చేయాలంటారు కాని- అక్కడి నుండి కదలరు. తను కూడా అక్కడే ఉండాలంటారు. ముందు తను పెళ్ళి చేసుకుంటే తన భార్యా అక్కడే. తనకు పిల్లలు పుడితే వాళ్ళూ అక్కడే. ఇలా తరతరాలుగా ఎదగని జీతంతో చాలని భత్యంతో బతకాలి. ఇక తమ జీవితాలు ఎందులోనూ ఎదగకూడదు, చదువుకోకూడదు. ఇంకో నౌకరీ నాలుగు డబ్బులు ఎక్కువ వచ్చేది చెయ్యకూడదు.

ఏమిటిది? ఎంతకాలం? ఏం బ్రతుకులు?

ఆ రాత్రికి రాత్రి బయలుదేరి వచ్చేశాడు రంగన్న, ఏదయినా కాస్త మెరుగ్గా ఉన్న నౌకరీ చూసుకోవాలని.

శాయన్నకు అతడిని చూడగానే ఎంతో సంబర మనిపించింది. సంతోషం కొద్దీ మనసు గంతులు వేసింది. తన బిడ్డకు లగ్గం ఎట్లా చేస్తానని బెంగ పెట్టుకున్నాడు. చేసిన అప్పు తీరలేదు. అది తీరందీ దొర పోనీయడు. అసలు ఇక్కడి నుంచి బైటపడ టానికి మార్గం లేదని క్రుంగిపోయాడు.

"రంగన్న! నీవు దిగులుపడమాక, నేనిప్పిస్త నీకు నౌకరీ. నేనొచ్చినదాంక నీవు ఈడుంటివా మంచి నౌకరి ఇప్పిస్త." రంగన్న భుజమ్మీద చెయ్యేసి నమ్మబలికాడు శాయన్న. చేతిలోకి వచ్చిన పిట్ట జారిపోకుండా జాగ్రత్త పడుతున్నాడు.

"చూడు రంగన్న, దొర వస్తడు, వచ్చినప్పుడు తెలివితో చెప్పిన పని జర మంచిగ చెయ్యాలె. వచ్చినప్పుడు నాలుగు నెలల జీతం ఒక్కసారి ఇస్తడు. మళ్ల ఎప్పుడన్న రానీ, నౌకర్లను దొర మంచిగ చూస్తడు. నీకేం ఫికర్ లేదంటున్న గద?" ధైర్యం చెప్పాడు శాయన్న.

రంగన్న కళ్లు ఒప్పగించి చూస్తున్నాడు.

"దొర ఎసుమంటోడంటే దొరా అనంగనే ఒంటిమీద అంగీ అయిన తీసి ఇస్తడు. నా బట్టలు చూసినావా? అన్నీ దొర ఇచ్చినవే". పెట్టె తెరిచి చూపించాడు రంగన్నకు. చలికి వేసుకునే కోట్లు రెండు-మామూలుగా వేసుకునే అంగీలు ఖరీదయినవి నాలుగు.

"మరి-రేపు పొద్దుగల పోదునా?"

"పోదువులే." రంగన్న మాటలో ఏదో జంకు కనబడుతున్నది. కలిగిన సందేహం తీరలేదు.

"చీకటి పడకుండ తిందామురా." తన గది లోకి తీసుకువెళ్లాడు. ఇద్దరూ గిన్నెలో అన్నం పెట్టు కున్నారు. కుండలో నుంచి ఉల్లిపాయ కారం వేసు కున్నారు.

శాయన్నకు మొదటి నుంచీ అన్నంలో చల్ల పోసుకుని తినే అలవాటు. ప్రతిరోజూ ఊళ్ళోకి వెళ్ళి ఎవరినయినా అడిగి చిన్న ముంతతో చల్ల తెచ్చుకుంటాడు. అదే రెండు పూటలా వాడుకుం టాడు. రంగన్న కోసం ఆరోజు మరింత తెచ్చాడు. ఇద్దరూ అదే పోసుకుతిన్నారు.

అన్నం తినగానే శాయన్న ఈతాకుల చాప పరచుకొని బీడి కాలుస్తూ పడుకున్నాడు. రంగన్న తలక్రింద బట్ట పెట్టుకుని పడుకున్నట్టే పడు కున్నాడు. శాయన్న గురక వినగానే లేచి చప్పుడు కాకుండా గేటు తెరుచుకుని మెల్లగా ఊరి ముఖంగా నడవటం మొదలుపెట్టాడు.

శాయన్న చెప్పినట్టు అరమైలు దాటితేగాని ఊరు రాలేదు. ఊళ్ళో పెంకుటిళ్ళు, గుడిసెలు-మిద్దెలు-ఐదారు వందల గడప ఉంది. మగవాళ్లు ఇళ్ల ముందర కూర్చుని మాట్లాడుకుంటున్నారు. ఏడు గంటలయినా కాలేదు. ఇంకా నడుస్తూ పోతున్నాడు. ఊరు నాలుగు వీధులూ తిరిగాడు. ఒక్క ఆడదయినా కనబడలేదు. ఒక్క పిల్ల కనబడ లేదు.

ఆ ఊరిజనం రంగన్నను చూడగానే మాట్లాడు కోవడం మానేసి- అతడిని అనుమానంగా చూడటం మొదలుపెట్టారు. ఒకచోట పది మంది

చేరి గుసగుసలాడుకోవటం మొదలుపెట్టారు. రంగన్న చొరవ తీసుకొని వాళ్ళ మధ్యకు వెళ్ళి కూర్చున్నాడు.

అందరూ అతడిని ఉలిక్కిపడ్డట్టు చూశారు. చూపులతోనే గుచ్చి గుచ్చి చూశారు అతడిని.

"మనదే వూరు?" ఆ గుంపులో పెద్ద అడిగాడు.

రంగన్న చెప్పటానికి జంకాడు. వాళ్ళంతా తన ఆచూకీ తండ్రికీ, భూకామందుకూ చెబుతారేమోనన్న అనుమానంతో పాటు భయం కూడా కలిగింది.

అతడు జవాబు చెప్పటానికి జంకినకొద్దీ వాళ్ళకు అనుమానం ఎక్కువ కావటం మొదలు పెట్టింది.

"నాది ఇక్కడే. నేను శాయన్న మేనల్లుణ్ణి, చూసి పోదామని వచ్చిన" అన్నాడు వాళ్ళంతా నమ్మేటట్టుగా.

"నీ అసుమంటి మేనల్లుడుంటే శాయన్న పిల్లను ఎందుకివ్వడు?" ఆ గుంపులో నుంచి ఎవరో సన్నగా అన్నారు చాటుగా కూర్చొని.

"అవును గద. శాయన్న తనకు మేనల్లుడు ఉన్నట్టు యెన్నడు అనలేదే?" మరొకరికి సందేహం వచ్చింది.

"చెప్పడు, చెప్పడానికి మనసిరిగిపోయింది. మా నాయనకూ మామకూ మాటల్లేక చాలా దినాలయింది." రంగన్న పరిస్థితులను అతుకుపెట్టడానికి ప్రయత్నిస్తున్నాడు.

"మరి ఇప్పుడెట్ల వచ్చినవ్?" సందేహాలు పరిష్కృతం కాలేదు.

నవ్వాడు రంగన్న. "మా నాయన చూడకుండ మాయమ్మ పంపింది."

అందరూ తలలూపి ఊరుకున్నారు. వాళ్ళ సంభాషణ మరి సాగలేదు.

రంగన్న లేచాడు. తనను వాళ్ళు నమ్మటం లేదు. ఆ ఊరేమో కొత్తగా ఉంది అనుకుంటూ ముందుకు సాగి వెనక్కి మళ్ళాడు. చెట్టుకింద ఒక వృద్ధుడు ఒంటరిగా కూర్చుని చుట్ట కాల్చుకుంటున్నాడు.

"తాతా, నా బీడికి కూసింత అగ్గిపెట్టు." దగ్గరగా కూర్చున్నాడు రంగన్న.

తన చుట్టతో అతడి బీడి వెలిగించి అప్పటి నుంచీ అందరూ అడిగిన ప్రశ్నలడిగాడు తాత. రంగన్న ఓపికతో చెప్పాడు.

తాతకు దగ్గుతెర వచ్చి తిప్పుకునేసరికి అరగంట పట్టింది.

"నీవు సూస్తే సరుకైనవాడివిగా ఉన్నావు. ఈ నెత్తురుకూడు కాకపోతే ఇంకెక్కడ బతకలేవా?" మళ్ళీ దగ్గాడు తాత.

రంగన్నకంతా అయోమయంగా ఉంది. శాయన్న తననేదో మభ్యపెడుతున్నాడని అర్థమయింది. తాత దగ్గర కూర్చుని మంచి మాటలు మాట్లాడాడు. అసలు సంగతి చెప్పమని తాతను గడ్డం పట్టుకున్నాడు.

"మరెవరితోనయిన అనేవ్." రహస్యంగా చెప్పుకు వచ్చాడు తాత. జాగీర్దార్ల పుట్టుపూర్వోత్తరాలు చెప్పి కథ సాగించాడు.

★ ★ ★

నసీరుద్దీన్ సాబ్ వరండా పైమెట్టు మీద నిలబడ్డాడు.

మూలనున్న నౌకర్ల గదిలో నుంచి శాయన్న పరుగుల మీద వచ్చి ఒంగి దణ్ణం పెట్టి "ఏం దొరా" అన్నట్టు చూశాడు.

"ఇంకా మోటరు రాలేదా?" అడిగాడు. ఆ భాష తెలంగాణాలో ప్రభువులు నౌకర్లతో మాట్లాడే తురక తెలుగు. ఆ కంఠస్వరం బానిసలతో మాట్లాడే ప్రభువుల కంఠస్వరం.

"ఇంక రాలేదు దొర, ఆడిదాకా పోయొచ్చిన." శాయన్న మోకాళ్ళు రెండూ గజగజ వణుకుతూ కొట్టుకుంటున్నాయి.

నసీరుద్దీన్ సాబ్ కళ్ళు ఎర్రపడుతున్నాయి. కనుబొమలు ముడిపడుతున్నాయి. పళ్ళు పటపట లాడిస్తున్నాడు.

కారు తీసుకుని వెళ్ళిన డ్రైవరు అంతులేడు.

శాయన్న మనసు అయోమయంగా ఉంది. దొర ఇక్కడ ఉన్న నాలుగు రోజులు నలుగురు కొత్త మనుష్యులు కావాలి. వాళ్ళు మంచి వయసులో ఉండాలి. సారా తాగి సీసాను విసిరేసినట్టు ఆ ఆడపిల్లలను తెల్లారినంక కాళ్ళతో తన్ని

తగలేసి పోవాలి.

ఈ దారుణ కృత్యానికి అటు డ్రైవరు, ఇటు శాయన్నా తలపడాలి. రెండు రోజులు గడిచాయి.

ఎట్లా గడిచాయో? అది మూడో రోజు.

శాయన్న, డ్రైవరు రాములు మధ్యాహ్నం నుంచి ఊరంతా తిరిగారు. నచ్చిన మనిషి కన బడలేదు. ఊరికి దూరంగా ఎరుకలవాళ్ల గుడిసె లున్నాయి. ఈత పేళ్ళతో బుట్టలల్లుకునే జాతి. పేళ్ళు ముందరేసుకుని కత్తితో మరింత సన్నగా చీల్చుకుని బుట్టలల్లుతున్నారు. ఆ తండాలో పది మంది వరకు పెద్ద వయసు మగవాళ్ళున్నారు. ఇద్దరు వయసులో ఉన్నవాళ్ళు-ఇద్దరు ఇరవై ఏళ్ళ ఆడపిల్లలున్నారు. ఐదుగురు నడీడు స్త్రీలు, ముగ్గురు చిన్న పిల్లలు ఉన్నారు. ఆడవాళ్ళూ మగ వాళ్ళూ కలిసి పాటలు పాడుతున్నారు. పని చకచక సాగిపోతున్నది.

ఆ తండాను, వాళ్ల చేతుల్లో ఉన్న కత్తులను చూసేసరికి శాయన్నకు గుండె లయ తప్పినట్ల యింది. వాళ్ళను ఎట్లా అడగటం? ఏమని అడగడం?

"మీరల్లే బుట్టలు బాగా అమ్ముడుపోతాయా? ఎక్కడి నుండి వచ్చారు?" తెలంగాణా యాసలో అడిగాడు.

"మేము అల్ల ఆ ఊరి నుండి ఈ పేళ్లతో లారీలో వచ్చినాం సామీ. ఈ బుట్టలు ఈడ కొనేవాళ్ళు తక్కువ. కొన్ని పోతయి." ఆ తండాలో మధ్య ఈడు మగవాడు జవాబిచ్చాడు.

ఆడవాళ్ళ వైపు చూస్తూ కూర్చున్నాడు రాములు.

మెడలో పూసల దండలు, చేతుల నిండా కొమ్ము గాజులు, మాసి చిరిగిన బట్టలు కట్టుకున్నా నిండైన విగ్రహాలు. పసిబిడ్డలు పాలు తాగు తున్నారు. పని సాగుతూనే ఉన్నది. చిలిపినవ్వులు-కొంటె నవ్వులు సాగుతున్నాయి. చేతులు పని చేస్తున్నా పాటలు ఆపి మాట్లాడుతున్నారు.

మధ్య మధ్య తండా పెద్ద "ఎహే పని గానీ యండి," అదలిస్తున్నాడు. మళ్ళీ పని చురుకుగా సాగుతోంది.

మెల్లగా రాములు తండా పెద్ద దగ్గరిగా జరిగాడు.

"ఇవిగాక చిల్లర పన్లేమయినా చేస్తారా?" జంకుతూ అడిగాడు.

"ఈ పన్లే చాలు మాకు." కళ్లయినా తిప్పి చూడకుండా అన్నాడు పెద్ద.

"అది కాదు అన్నా. ఈడ పెద్ద దొరోళ్ళ ఇంట్ల నిన్న పయోజనం జరిగినాది. అంట్ల గిన్నెలు తోమితే అన్నంపెట్టి పైసలిస్తరు. ఎంత-జరసేపు. ఓర్నన్న పంపుతావా?" రాములు అతడి భుజమ్మీద చెయ్యేశాడు స్నేహపూర్వకంగా.

తలవూపాడు పెద్ద. ఆలోచించాడు. కొంత సేపటికి "ఏమిస్తారు" అన్నాడు.

"ఎంత పని చేస్తే అంత!" ఆశ పెడు తున్నట్టుగా మాట్లాడాడు.

"ఎవరన్న పోతారా?" పెద్ద అడిగాడు ఆడ వాళ్ళ వైపు చూస్తూ.

నడీడు సత్తి ఎల్లివైపు చూసింది. ఎల్లి మంగి వైపు చూసింది. మంగి నాలుగు నెలల గర్భిణి. తొలిచూలు. నిగనిగలాడుతోంది నల్లరూపున.

మంగి ఎర్రోడివైపు చూసింది. ఎర్రోడికి కండ బలమెక్కువ. ముక్కుమీద కోపం. మాటకు మీసం మెలివేస్తాడు. ఎర్రోడంటే వెర్రివాడు కాడు. ఆ తండాలోకి ఎర్రటివాడు. చేతిమీద ఎర్రోడన్న పచ్చ కూడా పొడిపించుకున్నాడు.

"నీ పేరంటన్నవు?" తండా పెద్ద అడిగాడు రాములును చూసి.

## అద్దం

అబద్ధమాడని అద్దంలో
సృజనకర్త దస్తూరి అయిన అందాన్ని
దృష్టి కొలబద్దతో కొలుస్తూపోతే
అందం లోతు అంతుబడుతుందా?

మరి అందమైన అంతరంగం
వికారమైన బాహ్యరూపాన్ని
దృష్టి కొలబద్దతో కొలిస్తే
అద్దం నిజం చెబుతుందా?

**-భుజంగరావు కంచరాన**

"రాములు."

"ఏం పనిచేస్తావు?"

"నేను దొర కారు నడుపుత."

"చూడు, మా తండా ఆడది మగోడు లేందే ఎక్కడకీబోదు. పనిచేసి ఇద్దరు మడుసులు వస్తరు. మంచి ఇనాం యిచ్చి పంపాలి. బేగి పంపాలి. కాకపోతే తండా అంత వస్తది" కళ్ళు పైకెత్తి గంభీరంగా అన్నాడు.

ఆ మాటలకు బెదిరాడు రాములు.

"నీవెట్ల జెపితే అట్ల" కంఠస్వరం తగ్గించాడు రాములు.

శాయన్న దూరం నుంచి చూస్తున్నాడు.

"మాట తప్పితే చూసుకో" మళ్ళీ అన్నాడు హెచ్చరింపుగా పెద్ద.

ఓ దణ్ణం పెట్టాడు రాములు. పీక నులిపెయి అన్నట్లు రెండు చేతులు మెడకు తగిలించుకున్నాడు.

పెద్ద కనుసైగ చెయ్యగానే ఎర్రోడు, మంగీ లేచారు. రాములు లేచి నిలబడి దారితీశాడు. వాళ్ళిద్దరూ బట్టలు దులుపుకుని వెంట అడుగులు వేశారు.

"ఎట్టయిన రాములు అనుబవం కలోడు" అనుకుంటూ శాయన్న నిలుచున్న చోటి నుండి కదిలాడు.

ఊళ్లోకి నడుస్తుంటే రాములు గుండె దడదడలాడింది.

మంగి, ఎర్రోడు కొత్త జంటలా ఉన్నారు. ముఖాలు లేతగా ఉన్నాయి. రాములూ శాయిలూ చూడకుండా లోపల్లోపల నవ్వుకుంటూ కొంగులు పట్టి లాక్కుంటున్నారు.

బంగళా ముందుకు రాగానే 'లోపలికి పోదాం' రమ్మని రాములు ముందుకు నడిచాడు.

గేటులో అడుగుపెట్టగానే కనపడిన ఎర్రటి పువ్వులకు మంగి ముఖం చేటంతయింది. రాములు చూడకుండా రెండు పువ్వులు కోసి తల్లో తురుముకుంది. శాయన్న చూసీ చూడనట్టూరుకున్నాడు.

ఎడమచేతి వైపు పెరట్లోకి పోవటానికి మరొక గేటు వుంది. ఆ గేటు తెరచాడు రాములు.

"ఎక్కడ పని?" అన్నట్టు చూశాడు ఎర్రోడు. "నీళ్ళు బావిలో నుంచి తోడి తొట్టెలో పోసుకో. మంగి లోన అంట్ల గిన్నెలు తెస్తది."

రాములు తలుపు గొళ్ళెం తీశాడు. మంగి లోపల అడుగు పెడుతూ అటూ ఇటూ చూసింది. పెద్ద సావడి- నాలుగు వైపులా నాలుగు గదులలోకి దరవాజాలు, వాటికి తెరలు.

"ఎల్లమ్మా- ఎల్లి గిన్నెలు తెచ్చుకో చెల్లెమ్మా" అంటూ వెనక్కు తిరిగాడు రాములు.

మంగి రాములు చూపించిన గదిలో అడుగు పెట్టగానే దభాలున తలుపులు మూసుకున్నాయి.

ఎర్రోడు నీళ్ళు తోడి గాబులు నింపాడు.

మంగి కోసం చూశాడు.

ఏదీ మంగి? అరుస్తూ తనూ లోపల అడుగు పెట్టాడు. అక్కడ అతడికి మంగి కనబడలేదు. మంగీ అంటూ తలుపులు బాదాడు.

లోపల నుంచి గొడ్డు అరిచినట్టు అరుపులు వినపడుతున్నాయి.

బైటి నుంచి ఎర్రోడు వెర్రిగా తలుపులు బాదుతున్నాడు. లోపలి నుంచి వినిపించే అరుపులకు ఎర్రోడు బేజారెత్తిపోతున్నాడు. ఎంత బలంగా తన్నినా తలుపులు కదలటంలేదు.

ఎర్రోడు మండిపడుతూ గేటులోంచి అంగణంలోకి వచ్చాడు. అక్కడ శాయిలు లేడు. రాములు కంట పడగానే ఎర్రోడు గొంతు పట్టుకున్నాడు. ఇద్దరూ ఎంతోసేపు పట్టుపట్టారు. ముందుగా అనుకున్నట్లు రాములు ఎర్రోడిని చెట్టుకు కట్టేశాడు.

అరిచి అరిచి గొడ్డు అలిసిపోయినట్టుంది. అరుపులకు బదులు మూలుగు వినిపిస్తోంది.

## పైరవీ

'పైరవీ' పాపిష్టిది
పైసా కోసం చేయిసాచే ముష్టిది
అంతా అయిపోతుంది
అనిపిస్తుంది అనుక్షణం
గెలుపు తనదే అనిపిస్తుంది; తక్షణం.
మొదలుపెట్టాక తెలుస్తుంది
మనల్ని మనమే మోసగించుకున్నామని

—డా. బి.దామోదరరావు

ఎఱ్ఱోడికి ముఖం ఎఱ్ఱబడ్డది, హుంకరిస్తున్నాడు. కట్టిన తాళ్లను వదిలించుకోవటానికి గుంజుకుంటున్నాడు.

సింహద్వారం భడాలున తెరుచుకుంది. క్రాపు సవరించుకుంటూ దొర చరచర గరాజి దగ్గరికి నడిచాడు. తలుపులు తెరిచి కారు బైటికి తీశాడు. కార్లో కూర్చుంటూ ఇటూ అటూ కలయజూశాడు. తాళ్ళ మధ్య గింజుకుంటున్న ఎఱ్ఱోణ్ని చూసి వెధవ నవ్వొకటి నవ్వి కారు తలుపు వేసుకున్నాడు. కారు దూసుకుపోయింది. ఏ దిశన వెళ్ళిందో కూడా తెలియకుండా.

రాములు ఎఱ్ఱోడి కట్లన్నీ విప్పి "అంత గింజుకుంటవ్ ఎందుకు?" అన్నట్టు చూశాడు.

ఎఱ్ఱోడికంతా అర్థమయింది. సింహంలా రాములు మీదికి ఎగిరాడు. అతనిని గోడకానించి నిలబెట్టాడు. రెండు చేతులతో మెడ పట్టుకుని పటపటలాడేటట్టు మెడ మెలికలు తిప్పాడు. రాములు గుడ్లు బైటికి వచ్చేవరకూ తిప్పాడు. మెడ వాలిపోయేవరకూ తిప్పాడు. కాలితో ఒక తన్ను తన్నాడు. ఛీ, ఛీ అని ముఖమ్మీద ఉమ్మేశాడు.

పిచ్చెక్కినట్టే జుట్టు పీక్కుంటూ సింహద్వారం లోంచి లోపలికి వెళ్ళాడు.

పెద్ద హాలు, ఆ హాలు అందాన్ని మరొకప్పు డయితే ఎఱ్ఱోడు చూసి ఆనందించేవాడు. ఒక పెద్ద మంచం మీద మంగి పడుకుంది. తల వెంట్రుకలు చిందరవందరగా ఇటూ అటూ పాయలు పాయలుగా మంచానికి తలవైపున ఆవరించుకుని ఉన్నాయి. మంగి దేహం అస్త వ్యస్తంగా మంచమ్మీద పడి ఉంది. మంగి మెడ లోని పూసల పేరు తెగి మంచమ్మీద పూసలు అక్కడక్కడ పడ్డాయి. చేతి గాజులు, ముంచేతి గోట్లు విరిగిన ముక్కలు గది నావరించుకున్నాయి. మంగి కళ్ళు అరమోడ్పుగా ఉన్నాయి.

మంగిని కదిలించి చూశాడు. కడుపులో నించి దుఃఖం అలలు అలలుగా పైకి లేచింది. కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి. అంతలో అతడి కళ్ళు పెద్ద వయ్యాయి. ఎఱ్ఱటి జీరలు మరింత ఎఱ్ఱ వయ్యాయి. పిచ్చి ఎక్కినట్టు అక్కడి బీరువా తెరచి దానిలో ఉన్న బట్టలన్నీ మంగి మీద పడేశాడు. ఆ చుట్టుపక్కల ఉన్న దుప్పట్లు, దరవాజాలకు కట్టిన తెరలు తెచ్చిపడేశాడు. రొండిన చెక్కుకున్న బీడీ అవతల పారేసి అగ్గిపుల్ల గీశాడు.

బైటికి రాగనే మళ్ళీ రాములు శవం కనబడ్డది. మళ్ళీ ఒక్కసారి ఉమ్మేసి ఒక్కసారి బలంగా తన్నాడు.

ఎఱ్ఱోడికి నిజంగా పిచ్చే ఎక్కింది. మంగి, మంగి అని గొణుక్కుంటూ, ఏడుస్తూ నోట్లో తల గుడ్డ కుక్కుకుంటూ ఎవరో తరుముతున్నట్టుగా పరుగుతీశాడు. ఆ పరుగు తండా తగ్గరికి కాదు, మరొక దిశెకు.

నిజాం నవాబు కాలంలో జాగీర్దారు నశీరుద్దీన్ సాబ్ తన జాగీరులో నాలుగుచోట్ల కట్టిన అందమయిన భవనాలలో ఇదొక విలాస క్రీడ. ఈ క్రీడలకు నౌకర్లూ ఊరివాళ్ళూ అలవాటు పడ్డారు. ఆ ఊళ్ళలోని స్త్రీలలో ఎప్పుడు ఎవరికి ఏమి మూడు తుందోనని భయ పడుతూనే ఉంటారు. కొందరు జాగీరు దాటించి మరొక ఊళ్లో కుటుంబాలను ఉంచి చూసి వస్తూ ఉంటారు.

"మేము కొంపాగోడు ఇడువలేక ఉండి పోనాము. శాయన్న తనకిక్కడ ఉండబుద్ధి కాటం లేదన్నాడు నాతో." తాత ఆ ఊరి కథ చెప్పాడు.

రంగన్నకా కథ విన్న తరువాత ఒళ్ళు ఝల్లు మన్నది. రోలుపోయి మద్దెలతో మొరపెట్టుకున్నట్టుందనిపించింది.

తిన్నగా అటు నుంచి అటే ఊరిదారి పట్టాడు తన కిర్రు చెప్పులతో అతడు నడుస్తూంటే తండ్రి మాట్లాడిన మనువు భూలక్ష్మి జ్ఞాపకానికి వచ్చింది. అమావాస్య వెళ్ళిన అయిదవనాడు లగ్నం. లగ్నం అయిన మరునాడు మట్టితట్టలు మొయ్యటానికి నాగార్జునసాగర్ పోయినా "నాలుగు డబ్బులు కండ్లబడతయ్" అనుకుంటూ తలకు తువాలు బిగించి ముందుకు అడుగులు వేశాడు.

తెల్లవారి లేచి రంగన్న కోసం చూసిన శాయన్నకు గుడ్లు తేలిపోయాయి. తనకీ జన్మకు ఆ బంగళా నుంచి విముక్తి లేదని ముఖం వేలా దేసుకుని కూర్చున్నాడు తలమీద చేతులు పెట్టుకుని.

■